సాక్షి నిర్మల్

శుక్రవారం । 10 । మే । 2024



ఇంటర్ అడ్మిషన్లు షురూ.. 2లో▸

జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పచ్చ జెండా ఊపింది. గురువారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది.



వేసవి దుక్కులతో లాభాలెన్నో

భూసారం పెరిగేందుకు వేసవి దుక్కులు దున్నుకొని వానాకాలంలో పంటల సాగుకు సిద్ధం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. లోతైన దుక్కులతో అధిక దిగుబడులు పొందవచ్చు. 3లో▸

గరిష్టం/కనిష్టం
39.5 /28.4

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. వేడి, ఉక్కపోత కొనసాగుతాయి. ఒకటిరెండో చోట్ల వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యుత్ శాఖ ఎస్ఈగా శ్రీనివాస్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాస్

నిర్మల్‌చైన్‌గేట్: విద్యుత్ శాఖ నూతన ఎస్ఈగా బి.శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్ఎంసీలో ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై నిర్మల్‌కు వచ్చారు. నిర్మల్ ఎస్ఈగా విధులు నిర్వహించిన జేఆర్.చౌహాన్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తేమశాతాన్ని పరిశీలిస్తున్న నర్సయ్య

కుంటాల: జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి నర్సయ్య సూచించారు. మండలంలోని అంబకంటి గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. తేమశాతం నిబంధనల మేరకు వచ్చాకే రైతులు ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థ నిర్మూలించేందుకు జిల్లా వ్యాప్తంగా 92 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట సీఈవో నాగభూషణం, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

- టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్



సమీక్షలో అజయ్‌కుమార్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పిస్తామని టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీహెచ్ఎస్ కార్యాలయంలో టీవీ వీపీ ఆస్పత్రుల మెడికల్ ఆఫీసర్లతో గురువారం రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల్లో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు కావాల్సిన సౌకర్యాలపై చర్చించారు. పేషెంట్ సర్వీస్ విషయంలో ఇనిస్టిట్యూట్ పరిధిలోని సివిల్, శానిటేషన్, ప్లంబింగ్ పనులకు సంబంధించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ దేవేందర్‌రెడ్డి, భైంసా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ఖానాపూర్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వంశీమాధవ్, ముధోల్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌విజయానంద్ పాల్గొన్నారు.

వర్క్ ఆర్డర్ ఇప్పించాలని వినతి

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో విధులు నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి డీఎంయూ పరిధిలోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో పనిచేయడానికి వర్క్ ఆర్డర్ ఇప్పించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. 17 ఏళ్లుగా జిల్లా, మెటర్నిటీ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న తమ వర్క్ ఆర్డర్ మార్చితో ముగిసిందని తెలిపారు.

రెండోసారి మోసపోవద్దు..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నిర్మల్ శివాజీ చౌక్‌లో కేటీఆర్ కార్నర్ మీటింగ్‌కు హాజరైన జనం

- అరచేతిలో వైకుంఠం చూపిన రేవంత్..
- రూ.2,500, తులం బంగారం ఇచ్చిండా..
- రూ.2 లక్షల రుణమాఫీ చేసిండా..
- తెలంగాణలో బీజేపీని అడ్డుకునేది బీఆర్ఎస్సే
- నిర్మల్ కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్

నిర్మల్: 'మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో మీకు కరెంట్ కావాలా..! కాంగ్రెస్ కావాలా..! అని అడిగినం. కాంగ్రెస్‌ను నమ్మి మోసపోయిండ్రు. ఆరు గ్యారంటీలు అని అరచేతిలో వైకుంఠం చూపించిండు రేవంతు. ఆడబిడ్డల ఖాతాల్లో రూ.2,500, పెళ్లికి తులంబంగారం ఇస్తామన్నడు ఇచ్చిండా..? రైతురుణ మాఫీ ఇస్తామని తారీఖులు మార్చిండు తప్ప.. మాఫీ చేసిండా..? అందుకే కాంగ్రెస్‌ను నమ్మి రెండోసారి మోసపోవద్దు. పార్లమెంట్ ఎన్నికల్లో 13 ఎంపీ సీట్లు బీఆర్ఎస్‌ను గెలిపిస్తే.. మళ్లీ కేసీఆర్ సర్కారే వస్తుంది..' అని నిర్మల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో గురువారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. తులం బంగారం ఇస్తామని నరికిన రేవంత్‌రెడ్డి తులం ఇనుము కూడా ఇవ్వడని చెప్పారు.

పదేళ్లలో బీజేపీ ఏమిచ్చింది..

పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఏమిచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ ఇవ్వలేదని, ఆదిలాబాద్‌లో సిమెంట్ పరిశ్రమ తెరిపించలేదని ఆరోపించారు. నమో అంటే.. నమ్మించి మోసం చేసేటోడు..అని ప్రధాని నరేంద్రమోదీని ఉద్దేశించి అన్నారు. పదేళ్ల కిందట తాము అధికారంలోకి రాగానే ప్రతీ ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని, 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు.. ఇచ్చారా.. అని ప్రశ్నించారు. గుడి కట్టినం.. ఓటేయుండ్రి అని బీజేపీ ఇదొక్కటే చెబుతుందన్నారు. అలాగైతే కేసీఆర్ యాదాద్రిలాంటి ఎన్నో గుడులతోపాటు కాళేశ్వరం లాంటి ఆధునిక దేవాలయాలను నిర్మించాడన్నారు. మోదీ ప్రభుత్వం పదేళ్లలో పిల్లల మనసులో మత విద్వేషం నింపారని ఆరోపించారు.

మళ్లీ వాళ్లను రానిచ్చేది లేదు..

అధికారంలో ఉన్నప్పుడు పదవులను, అధికారాన్ని అనుభవించినవాళ్లు ఇప్పుడు పార్టీ ఓడిపోగానే కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారని మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్లు మంత్రి పదవిని అనుభవించి జంప్ కొట్టాడన్నారు. కష్టం రాగానే పారిపోయేటోడు ఏం నాయకుడని, ఈ వయసులో అవసరమా.. అని పేర్కొన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. అప్పుడు తిరిగి వీరిని ఎట్టి పరిస్థితుల్లో రానిచ్చేది లేదని స్పష్టంచేశారు. సోషల్‌మీడియాలో పంచాయితీలు అవసరం లేదని, 13 ఎంపీ సీట్లు గెలిపిస్తే మళ్లీ కేసీఆర్ సర్కారే వస్తుందన్నారు. ఆదిలాబాద్‌లో ఆత్రం సక్కును గెలిపిస్తే నిర్మల్‌లోనే క్యాంప్ ఆఫీస్ పెడతారని చెప్పారు.

గెలిపిస్తే.. పోరాడుతా..

ఆదిలాబాద్ ఎంపీగా గెలిపిస్తే.. ఇక్కడి ప్రజల సమస్యలను పరిష్కరించేదాకా కొట్లాడుతానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఆదిలాబాద్ నియోజకవర్గానికి ఏం చేయలేవని ఆరోపించారు. తమ ప్రభుత్వమే అభివృద్ధి చేసిందని చెప్పారు. ఈసారి ఎంపీగా గెలిపిస్తే.. కేంద్రంతో కొట్లాడి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్నర్ మీటింగ్‌లో నిర్మల్ జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీమంత్రి జోగురామన్న, నిర్మల్, ఖానాపూర్ ఇన్‌చార్జిలు రాంకిషన్‌రెడ్డి, జాన్సన్ నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు జానుబాయి, కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, పట్టణాధ్యక్షుడు మారుగొండ రాము తదితరులు పాల్గొన్నారు.

భైంసా రోడ్‌షోలో ఉద్రిక్తత



నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

భైంసా/భైంసాటౌన్: భైంసాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు చేదు అనుభవం ఎదురైంది. గతంలో రాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణతో కొందరు హనుమాన్ స్వాములు, మరికొందరు కేటీఆర్ నిర్వహించే కార్నర్ మీటింగ్ వద్దకు చేరుకున్నారు. కార్నర్ మీటింగ్ వద్ద 'కేటీఆర్ ఖబడ్దార్' అన్న ప్లకార్డులతో నిరసన తెలిపారు. పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. కేటీఆర్ వాహనం రోడ్‌షో ప్రాంతానికి చేరగానే జైశ్రీరాం నినాదాలతో నిరసన తెలిపారు. కేటీఆర్ ప్రసంగం ఆసాంతం జైశ్రీరాం నినాదాలతో అడ్డుతగిలారు. దీంతో కేటీఆర్ వారిపై ఒకింత అసహనం వ్యక్తం చేస్తూనే ప్రసంగం కొనసాగించారు. ఈ క్రమంలో కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసనకారుల వైపు దూసుకురావడంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. ఇరువర్గాలను పోలీసులు నిలువరించే ప్రయత్నం చేసినా, నిరసనకారులు కేటీఆర్ వాహనం వైపు దూసుకెళ్లారు. దీంతో కేటీఆర్ పోలీసుల పనితనం ఇదేనా అంటూ అసహనం వ్యక్తం చేశారు. నిరసనకారుల వైపు నుంచి కేటీఆర్ వాహనం పైకి ఉల్లిగడ్డలు రావడంతో, ఆయన పక్కనున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ముధోల్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ అడ్డుగా నిలిచారు. దీంతో మీ రాముడు రాళ్లు విసరమని చెప్పాడా అంటూ కేటీఆర్ నిరసనకారులనుద్దేశించి అన్నారు. అయినా నిరసనకారులు తగ్గకపోవడంతో కేటీఆర్ తన ప్రసంగాన్ని త్వరగా ముగించారు.

తెలంగాణ బాగుపడిందా...

కేటీఆర్ కార్నర్‌మీటింగ్‌లో ప్రసంగిస్తూ.. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోతలు మళ్లీ మొదలయ్యాయన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ అన్నింటా విఫలమైందన్నారు. విఠల్‌రెడ్డి గురించి ఆలోచన అవసరం లేదన్నారు. ఆయన పోతే చెత్త పోయిందని అనుకుంటామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. హెలిపాడ్ వద్ద నిర్మల్ జెడ్పీ చైర్మన్ కొరిపెల్లి విజయలక్ష్మి, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీఆర్ఎస్ ముధోల్ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, లోలం శ్యాంసుందర్‌తోపాటు పార్టీ శ్రేణులు కేటీఆర్‌ను స్వాగతం పలికారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

- జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రశాంత వాతావరణంలో పార్లమెంటు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, పోలింగ్ ఏర్పాట్లపై గురువారం మాట్లాడారు.

926 పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలో మొత్తం 926 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 306, ఖానాపూర్ పరిధిలో 309, ముధోల్‌లో 311 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వందశాతం వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 149 సమస్యాత్మక, నక్సల్ ప్రభావిత, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పేర్కొన్నారు. ఇక్కడ అదనపు బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కో నమూనా పోలింగ్ కేంద్రం(మోడల్ పోలింగ్ కేంద్రం) మహిళా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో టెంట్లు, షామియానా, తాగునీరు, ఫ్యాన్లు, బెంచీలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది, దివ్యాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్లు, వలంటీర్లు, ర్యాంప్ ఏర్పాటు చేశామని వివరించారు.

609 మంది హోమ్ ఓటింగ్...

85 ఏళ్ల పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రాలకు రాలేని దివ్యాంగులు మొత్తం 636 మందికి హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా, 609 మంది హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సీవిజిల్ యాప్ లో 14 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించామన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చిన ఫిర్యాదులను కూడా పరిష్కరించామన్నారు. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు.


రూ.3.81 కోట్ల మద్యం స్వాధీనం...

జిల్లాలో ఇప్పటి వరకు ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రూ.3.81 కోట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతున్నందున ఓటర్లకు అవగాహన పెంచడం కోసం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో 5కే రన్, కళాజాత వంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, డీపీఆర్వో విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లు, అకాల వర్షాలకు నష్టం జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా ధాన్యం శుభ్రపరిచేలా చూడాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో కేంద్రాలను పరిశీలించి రోజువారీ రిపోర్టులను సమర్పించాలని ఆదేశించారు. డీఎస్‌వో నందిత, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకళ, డీఏవో అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీ అశ్వాక్ పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



ఖానాపూర్‌లో నీటిలో ధాన్యం చూపుతున్న రైతులు



ఖానాపూర్ మార్కెట్ యార్డులో వాన నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం

ఖానాపూర్/కుంటాల: జిల్లాలో గురువారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసింది. ఖానాపూర్, కుంటాల మండలాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి రైతులు ఇబ్బంది పడ్డారు. మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కప్పేందుకు టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు ధాన్యం కాపాడుకునేందుకు తిప్పలు పడ్డారు. ఖానాపూర్ మార్కెట్ యార్డులో వరదకు ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. కుంటాల మండలం కల్లూర్, అందాకూర్, అంబకంటి, ఓలా, కుంటాల, లింబా(కె) తదితర గ్రామాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు తడవకుండా రైతులు జాగ్రత్త పడ్డారు.


రైతులు ఆందోళన చెందొద్దు



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: అకాల వర్షం కారణంగా ధాన్యం తడిసిన రైతులు ఆందోళన చెందొద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. పంట తడిసి నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, రైతులు ఉన్నారు.

సమయం లేదు మిత్రమా..



ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

- ప్రచారానికి ఇంకా రెండు రోజులే..
- హడావుడి పెంచిన పార్టీలు
- ప్రతీ ఓటరును కలుస్తున్న నేతలు
- ప్రలోభాలకు గుట్టుగా ఏర్పాట్లు!

నిర్మల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరింది. శుక్ర, శనివారాలు మాత్రమే ప్రచారానికి గడువు మిగిలింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం ఆరుగంటలతో ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడనుంది. దీంతో 'సమయం లేదు మిత్రమా..' అంటూ పార్టీలు పరుగులు పెడుతున్నాయి. అభ్యర్థులు హడావుడిగా అడుగులు వేస్తున్నారు. రెండురోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

ఉరుకులు.. పరుగులు..

పట్నం, పల్లె నిద్ర లేవకముందే.. ఎన్నికల రథాలు గల్లీల్లోకి వచ్చేస్తున్నాయి. అభ్యర్థుల పాటలే నిద్రలేపుతున్నాయి. ఒక పార్టీ వెనుక మరొకటి వరుసగా ఊళ్లల్లోకి దూసుకు వస్తున్నాయి. ఉదయం ఊరంతా ఉపాధి పనులకు వెళ్తే.. అభ్యర్థులు, నేతలూ అక్కడికే వెళ్లి వాళ్లతో ముచ్చట పెడుతున్నారు. తమకే ఓటువేసి గెలిపించాలని కోరుతున్నారు. ప్రచార గడువు దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు, నేతలు వేకువ జామునే సిద్ధమవుతున్నారు. ఐదుపది మంది అనుచరులు, కార్యకర్తలు రాగానే 'చలో.. చలో..' అంటూ ప్రచారానికి పరుగుదీస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రచారంలోనే గడిపేస్తున్నారు. ఎర్రటి ఎండలోనే ఊళ్లను చుట్టేస్తున్నారు. వడివడిగా అడుగులు వేస్తూ.. పరుగులాంటి నడకతో.. ఇంటింటికీ వెళ్తున్నారు. స్వయంగా ఓటర్లను కలిసి తనను గెలిపించాలంటూ అభ్యర్థిస్తున్నారు.

ఈరోజు, రేపే చాన్స్..

ఎన్నిక ముగిసే సమయానికి 48 గంటల ముందు నుంచే ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుంది. ఈనెల 13 సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఈప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రచారానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే దాదాపు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎంపీ అభ్యర్థులు ప్రచారం పూర్తి చేశారు. ఇంకా మిగిలిన గ్రామాలు, మండలాల్లో ఆయా పార్టీల నేతలు చక్కర్లు కొడుతున్నారు. ఏ ఊరిని, ఏ ఇంటినీ వదలకుండా పార్టీలు ప్రచారవేగాన్ని పెంచుతున్నాయి.

గ్రూపులుగా విడిపోయి..

ప్రచారం చివరి అంకంలో పార్టీల నాయకులు గ్రూపులుగా విడిపోయి పనులు చక్కబెడుతున్నారు. ఊళ్లల్లో అధికసంఖ్యలో ఉన్నవర్గాల వద్దకు వెళ్తున్నారు. వారితో సమావేశమవుతూ తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. తమ నుంచి ఏం ఆశిస్తున్నారో తెలుసుకుంటూ సాధ్యమైన వరకు పని పూర్తిచేస్తున్నారు. లేనిపక్షంలో గెలిచిన తర్వాత పనులు చేసి పెడతామంటూ హామీలిస్తున్నారు.

ప్రలోభాలు తక్కువే..

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంట్ పోరులో ప్రలోభాలు తక్కువే కనిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధితోపాటు ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఎవరికీ ఏం ఇవ్వలేమంటూ పార్టీలు ఖాళీ చేతులు చూపుతున్నాయి. కొన్ని ప్రభావిత వర్గాలు, వ్యక్తులను మాత్రం ప్రలోభ పెడుతున్నాయి. ప్రచారం ముగిసిన తర్వాత 48 గంటలు ఎలా ఉండాలి.. ఏం చేయాలి.. అనేదానిపైనా చర్చించుకుంటున్నాయి.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు

- ఎస్పీ జానకీషర్మిల



మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో పోలింగ్ బందోబస్తుపై గురువారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ సందర్భంగా ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతపై సమీక్ష నిర్వహించారు. సూచనలు చేశారు. అధికారులు, సిబ్బందికి ఉన్న అనుమానాలు నివృత్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పదంగా కనిపిస్తే సమీపంలోని అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టే వారిని అదుపులోకి తీసుకుని ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ సూర్యనారాయణ, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ, రూరల్ సీఐలు అనిల్, నవీన్‌కుమార్, ఎస్సైలు, రూట్ మొబైల్స్ ఇన్‌చార్జి అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ పోతే ఆందోళన వద్దు

- ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల

నిర్మల్ టౌన్: మొబైల్ ఫోన్ పొతే ఆందోళన వద్దని, సంబధిత పోలీస్ స్టేషన్‌లో లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చెయాలని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల సూచించారు. https://www.ceir.gov.in/ వెబ్ పోర్టల్ ద్వారా ఫోన్ ఆచూకీ తెలుసుకోవడం సులభమన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 87 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటిని బాధితులకు ఎస్పీ కార్యాలయంలో గురువారం అందజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో చౌకగా వస్తుందని, సెకండ్‌హాండ్ ఫోన్లు కొనేముందు సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేసుకోవాలన్నారు. దొంగతననికి లేదా ఫోన్‌లను వెతికి పెట్టడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఇప్పటికే పలు రకాల సాంకేతిక అంశాలను ఉపయోగిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు 697 ఫోన్లను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐటీ కోర్, వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



శ్రీహరిరావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈ నెల 13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు కోరారు. దిలావర్‌పూర్ మండలం సముందర్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఏఎంసీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ అనూహ్య రీతిలో పుంజుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజాపాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు, వసంత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సమావేశం

లోకేశ్వరం: మండల కేంద్రంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ కన్వీనర్ జయసాగర్‌రావు తెలిపారు. సమావేశానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నాగేశ్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఇంటర్ అడ్మిషన్లు షురూ..

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశాలు
- ఉమ్మడి జిల్లాలో 254 కళాశాలలు

నిర్మల్‌ఖిల్లా: జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ పచ్చజెండా ఊపింది. గురువారం నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు, కేజీబీవీ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 32వేలకు పైగా మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. వీరంతా ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి.

రెండేళ్ల కోర్సులు

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, ప్రైవేట్, టీఎస్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, మైనార్టీ, కేజీబీవీ, టీఎంఆర్జేసీ, టీఎస్ మోడల్ జూనియర్ కాలేజీల్లో రెండేళ్ల ఇంటర్ కోర్సులు అందిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు, ఒకేషనల్ విభాగంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎమ్మెల్టీ, ఫ్యాషన్ డిజైనింగ్, క్రాప్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంటు, అకౌంట్స్ అండ్ టాక్సేషన్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

అడ్మిషన్ల ప్రక్రియ ఇలా....

ఇంటర్ ఫస్టియర్ తరగతులు జూన్ ఒకటి నుంచి ప్రారంభం కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన టీసీ, స్టడీ సర్టిఫికెట్, తాత్కాలిక టెన్త్ మార్కుల మెమో ఆధారంగా ప్రిన్సిపాల్‌లు ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తారు. ఒరిజినల్ ఎస్సెస్సీ సర్టిఫికెట్ సమర్పించిన తర్వాత అడ్మిషన్లు నిర్ధారిస్తారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం, పీహెచ్ 5 శాతం, ఎన్సీసీ, స్పోర్ట్స్ కోటా 5శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్ 3శాతం, ఈడబ్ల్యూఎస్ 10 శాతం సీట్లు కేటాయిస్తారు. 33.3 శాతం అంటే 1/3 వంతు సీట్లు బాలికలకు రిజర్వ్ చేస్తారు. పదో తరగతిలో పొందిన గ్రేడింగ్ ఆధారంగా అడ్మిషన్లలో ప్రాధాన్యతనిస్తారు. తెలంగాణ ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన అనుబంధ కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని అధికారులు సూచిస్తున్నారు. అందుబాటులో ఉన్న కాలేజీల జాబితాను అధికారిక వెబ్‌సైట్ tsbie. cgg. gov. in చూడవచ్చు.



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల (ఫైల్)

షెడ్యూల్ ఇలా...
తొలి విడత అప్లికేషన్లు జారీ : 9-5-2024
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ : 31-5-2024
తరగతుల ప్రారంభం : 01-06-2024
అడ్మిషన్లు పూర్తయ్యే తేదీ : 30-6-2024

జిల్లాల వారీగా వివరాలు

జిల్లా	పదో తరగతి ఉత్తీర్ణులు	ఇంటర్ కాలేజీలు (ప్రభుత్వ, గురుకుల,ప్రైవేటు)
నిర్మల్	8,823	63
ఆదిలాబాద్	9,641	66
మంచిర్యాల	8,579	77
కుమరంభీమ్	5,325	48

సద్వినియోగం చేసుకోవాలి...



ఇంటర్ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పదవ తరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తమకు నచ్చిన కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చు. అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయి. ఉచిత పాఠ్యపుస్తకాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అన్ని రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీలోనే చేర్పించాలి. ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించి ఆర్థికంగా నష్టపోకూడదు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలోనే నాణ్యమైన విద్య ఉచితంగా లభిస్తుంది.

– జాదవ్ పరశురాం, డీఐఈఓ, నిర్మల్ జిల్లా

బైక్‌పై ఎమ్మెల్యే ప్రచారం



బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే

లోకేశ్వరం: ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం మండలంలోని అబ్దుల్లాపూర్ నుంచి ఉపాధి హామీ కూలీలు పనిచేసే చోటుకు బైక్‌పై వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పనిస్థలానికి వెళ్లేందుకు రోడ్డు సరిగా లేక పోవడంతో బైక్‌పై ప్రయాణించారు. బీజేపీ తరఫున బరిలో దిగిన గోడం నగేష్‌ను గెలిపించాలని కోరారు.

వ్యాపారి అదృశ్యం

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఫైనాన్స్ వ్యాపారి నాగమల్ల సురేష్ ఈ నెల 6న అదృశ్యమైనట్లు టౌన్ ఎస్సై అంజయ్య గురువారం తెలిపారు. చిట్ ఫండ్ వ్యాపారం నిర్వహించే సురేష్ ఇతరుల నుంచి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిళ్లు వస్తుండడంతో తట్టుకోలేక ఇంటినుంచి వెళ్లిపోయాడన్నారు. వ్యాపారి భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఎన్నికల నియమావళి ఉల్లంఘనులపై కేసు

ఖానాపూర్: బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ నిర్వహణ కోసం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అనుమతి ఇవ్వగా 7 గంటల 22 నిమిషాల వరకు కార్యక్రమం నిర్వహించడంతో నియమావళి ఉల్లంఘన కిందికి వచ్చిందన్నారు. దీంతో వీఎస్‌టీ–2 టీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌తో పాటు గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఖానాపూర్‌లో రూ.500 నకిలీ నోటు కలకలం



నకిలీ నోటును చూపుతున్న బాధితుడు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల ఎస్బీఐ ఏటీఎంలో రూ.500 నకిలీ నోటు రావడం కలకలం రేపింది. పట్టణంలోని ఇంద్రానగర్ ఎస్సీ కాలనీకి చెందిన ద్యావతి గంగాధర్ ఏటీఎంలో డబ్బులు డ్రాచేసి బ్యాంకులో డ్వాక్రా లోన్ చెల్లించేందుకు తీసుకెళ్లగా అధికారులు గుర్తించి నకిలీ అని తేల్చారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

జీజీహెచ్‌లో షార్ట్ సర్క్యూట్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో వైద్యపరికరాలు, కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఆస్పత్రికి విద్యుత్ సరఫరా చేసే స్తంభం నేలవాలింది. షార్ట్ సర్క్యూట్ జరిగి ఆస్పత్రిలోని ఆరు కంప్యూటర్లు, మూడు ఈసీజీ మిషన్లు, ఐదు మల్టీప్యారా మీటర్లు, రెండు ఎబాస్ మిషన్ అడాప్టర్లు, విద్యుత్ కంట్రోల్ ప్యానల్, ఫ్యాన్లు, లైట్లు, సీసీ కెమెరాలు, రెండు సిరంజి పంపులు, ఒక వెంటిలేటర్ ఎయిర్ కంప్రెషర్, ఇంటర్నెట్ రూటర్‌లు పాడైనట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి తెలిపారు. రూ.5 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు సమాచారం అందించామన్నారు.

ఇద్దరు వ్యక్తులపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గణేశ్ రఫీక్ అనే వ్యక్తితో మద్యం తెప్పిస్తూ కాలనీలో అమ్మకాలు జరుపుతున్నాడు. ఈ క్రమంలో బస్టాండ్ వైపు నుంచి 10 లీటర్ల మద్యం తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామాలయంలో చోరీ

జన్నారం: మండలంలోని రేండ్లగూడ రామాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలోనికి ప్రవేశించి ప్రధాన ద్వారం పగులగొట్టే ప్రయత్నం చేశారు. తలుపులు తెరుచుకోకపోవడంతో హుండీని అపహరించుకుపోయారు.

మొగులు.. గుబులు



కమ్ముకొస్తున్న మబ్బులతో రైతుల్లో గుబులు మొదలైంది. గురువారం మండలంలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కల్లాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరిధాన్యంపై రైతులు ముందస్తు జాగ్రత్తగా టార్పాలిన్లు కప్పుకున్నారు. - పెంబి

వ్యభిచార గృహాలపై దాడి

- నిర్వాహకుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హౌజింగ్ బోర్డు, టీచర్స్ కాలనీతో పాటు పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నిర్వహిస్తున్న మూడు వ్యభిచార గృహాలపై పోలీసులు దాడి చేశారు. గురువారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారన్నారు. ఇందులో కపిల్ అనే వ్యక్తి పరారీలో ఉండగా మిగితా వారిని అరెస్టు చేశామన్నారు. న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన హెచ్.వంశీకృష్ణ, ఎస్.అశోక్, కాలనీకి చెందిన కే.బాబాసాహెబ్ వ్యభిచార గృహం నిర్వహిస్తుండగా కపిల్ అనే వ్యక్తి మహిళలను రవాణా చేస్తున్నారన్నారు. టీచర్స్ కాలనీలో అదే కాలనీకి చెందిన ఎస్.రవితేజ, గుడిహత్నూర్ మండలం మన్నూర్‌కు చెందిన విశాల్ వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో గుడిహత్నూర్ మండలానికి చెందిన షేక్ సలీం, మహాలక్ష్మివాడకు చెందిన అద్నాన్ అహ్మద్, ఎండీ అజీముద్దీన్ వ్యభిచార గృహాలు నిర్వహిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి రూ.7,500 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై 137, 138 సెక్షన్‌లతో పాటు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 166, అండర్ సెక్షన్ 3, 4, 5 ఎమోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ యాక్ట్ 1956 కేసులు నమోదు చేశామన్నారు. బాధిత మహిళలకు పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్, టూటౌన్ సీఐ అశోక్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, మావల ఎస్సై విష్ణువర్ధన్, సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి బలవన్మరణం

సారంగపూర్: సెల్‌ఫోన్ ఇవ్వలేదని విద్యార్థి బలవన్మరణం చెందిన సంఘటన మండలంలోని బోరిగాంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జట్ల రాజేశ్వర్–లక్ష్మి దంపతుల దత్తత కుమారుడు రాకేష్ (13) సెల్‌ఫోన్‌లో రీల్స్, ఇతర సోషల్ మీడియా పోస్టులకు అలవాటు పడ్డాడు. దీంతో పాటు అందులో వచ్చే గేమ్స్ ఆడటం, వాటికి తగ్గట్లుగా ప్రవర్తించేవాడు. రెండురోజులుగా అతనికి సెల్‌ఫోన్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో ఎస్సై చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై

కుంటాల: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రజనీకాంత్ తెలిపి న వివరాల మేరకు మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన కొండూరి గంగాధర్ (63)కు 30 ఏళ్ల క్రితం అతని భార్యతో విడాకులయ్యాయి. అప్పటినుంచి ఒంటరిగానే ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరి గున్నాల పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి



విఠల్ (ఫైల్)

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ డి.విఠల్ (60) బుధవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం ఉపాధిహామీ పనులకు వెళ్లిన విఠల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు భైంసా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య సావిత్రిబాయి, కుమార్తె లలిత ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

చెన్నూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక క్వారీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ జాతీయ రహదారి పక్కన నిలిపి ఉంది. వాహనాల తనిఖీలో భాగంగా లారీని తనిఖీ చేయగా డ్రైవర్ మనోరంజన్ హజ్రా వద్ద ఎలాంటి వేబిల్లు లభించలేదు. దీంతో లారీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు లారీ డ్రైవర్ మనోరంజన్ హజ్రాతో పాటు లారీ యాజమాని జంగ రవిచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు. కాగా నెలరోజుల క్రితం ఇదే లారీ పట్టుబడినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ఇద్దరికి జైలు

నిర్మల్‌టౌన్: ఒకరిపై దాడి చేసిన కేసులో ఇద్దరికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. నిర్మల్ రూరల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన రొడ్డ ఎర్రన్న ఇంటి ముందు 2016 నవంబర్ 12న అదే గ్రామానికి చెందిన గడ్డం రాజు, అతని తండ్రి గంగన్న చెత్త పారేయడంతో వారిని ప్రశ్నించాడు. దీంతో అతనిపై దాడిచేసి గాయపర్చారు. బాధితుడు నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై అరిఫొద్దీన్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ నిందితులు గడ్డం రాజు, గంగన్నకు ఐదునెలల సాధారణ జైలు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మహిళ మృతి

కౌటాల: మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన చునార్‌కార్ మీరాబాయి (58) ప్రమాదవశాత్తు పెన్‌గంగలో పడి మృతి చెందిందని ఎస్సై ఎస్.మధుకర్ గురువారం తెలిపారు. మీరాబాయి బుధవారం గ్రామ శివారులోని తమ చేనులో మిర్చి తెంపేందుకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెన్‌గంగలో మృతదేహాన్ని గుర్తించారు. నదిలో నీటిని తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు మోరేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహం లభ్యం

జైపూర్: ఈ నెల 2న అదృశ్యమైన వృద్ధురాలి మృతదేహాన్ని గురువారం మండలంలోని ఇందారం రైల్వేట్రాక్ సమీపంలోని చెట్లపొదల్లో పోలీసులు గుర్తించారు. మంచిర్యాల రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న పొగిల్ల యాదగిరి తల్లి కొండమ్మ(70) మతిస్థిమితం కోల్పోయి ఈ నెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. ఈ నెల 6న మంచిర్యాల పోలీస్ స్టేషన్లో ఫి ర్యాదు చేశారు. వృద్ధురాలు మృతదేహాన్ని గు ర్తించిన పోలీసులు మంచిర్యాల పోలీస్ స్టేషన్లో నమోదైన మిస్సింగ్ కేసుపై ఆరా తీయగా కొండమ్మగా నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

చిల్లరకు బదులు సరుకులు

- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న బీపీఎం
- ఇబ్బందులు పడుతున్న పింఛన్ లబ్ధిదారులు

పెంబి: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ అందజేస్తోంది. అయితే మందపల్లి బీపీఎం రూ.16 చిల్లర లేదంటూ లబ్ధిదారులకు సబ్బులు, సర్ఫులు, అగ్గిపెట్టెలు, తదితర కిరాణ సామాను అంటగడుతున్నాడని బాధితులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగుడు బోసు మైసయ్య గురువారం పింఛన్ తీసుకునేందుకు మందపల్లిలోని బీపీఎం చంద్రశేఖర్ వద్దకు వెళ్లగా రూ.4 వేలు ఇచ్చి మిగతావి చిల్లరలేదంటూ సబ్బులు, అగ్గిపెట్టెలు ఇచ్చాడు. అంతే కాకుండా రెండు మూడు రోజులు మాత్రమే పింఛన్ ఇస్తానని, లేదంటే మరో నెలవరకు ఆగాల్సిందేనని చెప్పడంతో దివ్యాంగుడైన మైసయ్య నాగాపూర్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న మందపల్లికి బస్సులో వెళ్లి అక్కడి నుంచి అర కిలోమీటర్ దూరం వరకు నడుచుకుంటూ వెళ్లాడు. నడవలేని స్థితిలో ఉన్న తనకు ఇంటివద్దే ఇవ్వాల్సి ఉండగా అలా ఇవ్వడంలేదని, తీరా ఇక్కడికి వచ్చినా చిల్లర లేదంటూ కిరాణ సరుకులు అంటగడుతున్నాడని వాపోయాడు. చిల్లర ఇవ్వకపోవడమే కాకుండా అమర్యాదగా మాట్లాడుతున్న బీపీఎంపై చర్యలు తీసుకోవాలని పింఛన్ లబ్ధిదారులు కోరుతున్నారు.



సబ్బులు చూపిస్తున్న బోసు మైసయ్య

తరుగు పేరిట కోత విధించొద్దు



లెఫ్ట్‌పోచంపాడ్ శివారులో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

- కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి
- రైతులకు నష్టం జరగకుండా చూడాలని వినతి

సోన్: కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట ధాన్యంలో కోత విధించొద్దని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వెల్మల్, సిద్దులకుంట, లెఫ్ట్‌పోచంపాడ్, పాక్‌పట్ల, జాఫ్రపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గోదావరిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి మాట్లాడారు. పని ప్రదేశంలో ట్రాక్టర్లను వినియోగించడంపై ఎమ్మెల్యే.. ఏపీవోతో ఫోన్‌లో మాట్లాడారు. తాము నిబంధనల ప్రకారం పనులు చేయిస్తున్నామని ఏపీవో సమాధానమిచ్చారు. అనంతరం కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం పేరిట క్వింటాల్‌కు ఐదుకిలోలు కోత విధిస్తున్నారని పలువురు రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయమై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నిబంధనల ప్రకారం తూకం వేయాలన్నారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యనారాయణగౌడ్, హరీశ్‌రెడ్డి, గంగన్న, రమేశ్‌రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఘనత మోదీదే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: పూర్తిమెజార్టీ ఉన్నా పదేళ్లలో ఏనాడు మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు రద్దు చేయలేదని, అగ్రవర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. నిర్మల్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని, రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. పదేళ్లు పారదర్శక పాలన సాగించిన మోదీని విమర్శించే అంశం లేకపోవడంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన మాదిగలు రిజర్వేషన్ల ప్రయోజనం పొందేలా ఎస్సీ వర్గీకరణకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వబోమని హామీ ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, అసెంబ్లీ కన్వీనర్ గాదే విలాస్, మాజీ కౌన్సిలర్ నూతన భూపతిరెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ అయ్యన్న గారి రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, బీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తోట సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

భూగర్భ గనిలో పనికి భయపడి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఉద్యోగం చేయలేక ఓ సింగరేణి కార్మికుడు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని హమాలివాడకు చెందిన ఊరుగొండ ఓదెలు సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ అయి రెండో కు మారుడు సాయికుమార్(27)ను పనిలో పె ట్టించాడు. గత నెల 20న ఆర్జీ–1 గోదావరిఖని మైన్‌లో బదిలీ వర్కర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి సాయికుమార్ తరచూ తండ్రితో నాన్న నాకు మైన్‌లో దిగాలంటే భయంగా ఉంది.. నేను ఉద్యోగం చేయలేనంటూ మొరపెట్టుకునేవాడు. కొన్ని రోజు లు కష్టపడితే ఓపెన్‌కాస్ట్‌లో పెట్టిస్తానని తండ్రి ధైర్యం చెప్తూ వచ్చాడు. గురువారం డ్యూటీకి వెళ్లిన సాయికుమార్ రైలు ప ట్టాలపై శవమై కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
ONE SITTING

■అడ్మిషన్స్ గైడెన్స్ Fast Track 10th, ఇంటర్, డిగ్రీ, P.G, LL.B, B.Tech, B.Sc, M.Sc అగ్రి, Ph.D కొన్ని సీట్లు మాత్రమే. సెల్: 7013038197. [W-1264899]

WANTED
WANTED TEACHERS

■ Wanted Teachers We need all Subjects Teachers Also Need Yoga, Art & Craft, Dance & PET English Fluency is Must. Qualification: D.Ed/B.Ed or Teaching Experience is must... Salary package 15,000 to 18,000 Per Month Minimum 5 Years Experience. Fist Steps School Vidyanagar, Echoda, Adilabad Dist. Contact: 9912347799, 9494940387. [Z-1080612]

www.sakshi.com

■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/– మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 9502615217. [M-1185070]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,